క్లుప్తంగా

రామాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్టాపన



పాల్గొన్న ఎమ్మెల్యే గణబాబు

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు చంద్రనగర్ రామాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ట ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గణబాబు పాల్గొని, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయంలో సీతారాములను దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు స్వామి వారి శేష వస్త్రాలు, తీర్థ ప్రసాదాలు అందించారు.

ఘనంగా తేరు ఊరేగింపు



మేరీమాత స్వరూపాన్ని తేరులో ఊరేగిస్తున్న క్రైస్తవులు

కంచరపాలెం: జ్ఞానాపురం పరిధి పునీత పేతురు ప్రధాన దేవాలయంలో పారిస్ పాస్టిల్ కౌన్సిల్, విచారణ గురువులు ఫాదర్ జొన్నాడ జాన్‌ప్రకాష్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం తేరు మహోత్సవం నిర్వహించారు. తేరు ఉత్సవంలో దేవవర ప్రసాదాల మాత అవతారంలో దేవమాత తేరు (పల్లకి) ఉత్సవం నిర్వహించారు. స్లీప్‌గుర్తువీధి, రేబరిల్, సిరిల్ మాన్యువల్, డయాస్, నికోలస్ తదితర వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో పీపీసీ సభ్యులు, అధిక సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు.

వాకింగ్ చేస్తూ వృద్ధుడి మృతి

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వృద్ధుడు వాకింగ్‌కు వెళ్లి మృతి చెందిన ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. కంచరపాలెం ధర్మానగర్‌లో నివసిస్తున్న అల్లి సింహాద్రి(75) శనివారం మధ్యాహ్నం భోజనం అనంతరం ఇంట్లో చెప్పకుండా అలా నడుచుకుంటూ బయటకు వెళ్లాడు. ఈ క్రమంలో ఆశీర్వాద్ ఫంక్షన్ హాల్ దగ్గర రోడ్డుపై ఒక్కసారిగా కుప్పకూలి పడిపోవడాన్ని స్థానికులు గమనించి వెంటనే 108కు కాల్ చేశారు. అక్కడ నుంచి అంబులెన్స్‌లో ఆస్పత్రికి తీసుకు వెళ్తుండగా అప్పటికే మృతి చెందాడని వారు చెప్పారు. విషయం తెలుసుకున్న పోలీసులు వృద్ధుడి కుటుంబ సభ్యుల కోసం ఆరా తీసి వారికి సమాచారం అందించారు. సింహాద్రి వృద్ధుడు కావడం, లో బీపీ ఉండటం, మద్యం తాగే అలవాటు ఉండటంతో మృతిచెంది ఉండవచ్చని వారు భావిస్తున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సీఐ ఎస్.భాస్కరరావు నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ వి.వి రమణ కేసు దర్యాప్తు చేపట్టారు. వృద్ధుడు సింహాద్రి డప్పులు కొడుతూ ఉంటాడని పోలీసులు తెలిపారు.

థాయ్‌లాండ్ వేదికపై విశాఖ చిన్నారి



చిన్నికకు కిరీటం అలంకరిస్తున్న నిర్వాహకులు

గాజువాక : ప్రపంచ దేశాల పిల్లల మధ్య జరిగిన మోడలింగ్ పోటీల్లో విశాఖకు చెందిన చిన్నారి ప్రతిభ కనబరిచింది. గాజువాక ప్రాంతానికి చెందిన ఏడేళ్ల చిన్నిక థాయ్‌లాండ్‌లో జరిగిన పోటీల్లో భారతదేశం తరపున పాల్గొని విజయం సాధించింది. వివిధ దేశాల్లో జరిగిన పోటీల్లో విజేతలతో నిర్వహించిన ఈ పోటీల్లో సీనియర్ టోడ్లర్ విభాగంలో మొదటి స్థానాన్ని సాధించడంతో పాటు ఎక్స్‌ట్రీమ్ టాలెంట్, బెస్ట్ ఇంట్రడక్షన్ సబ్ టైటిల్స్‌ను సొంతం చేసుకుంది. పదిహేను దేశాల చిన్నారులు పాల్గొన్న ఈ పోటీల్లో చిన్నిక విజయఢంకా మోగించడంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాదకర ప్రయాణం

- అధ్వానంగా ఎదురవానిపాలెం మార్గం
- వాహనచోదకులకు నిత్యం నరకం



గోతులు పడిన బీటీ రోడ్డు



ఎదురవానిపాలెం గ్రామంలోకి వెళ్లే మలుపు వద్ద బీటీ రోడ్డు దుస్థితి

మల్కాపురం: ఆ గ్రామానికి వెళ్లాలంటే ద్విచక్ర వాహనదారుల్లో ఒకటే ఆందోళన.. సర్వీస్‌రోడ్డు మొత్తం రాళ్లు తేలడంతో పాటు గోతులమయం కావడమే ఇందుకు కారణం. రాత్రయితే ఇక్కడ తరచూ ప్రమాదాలు జరుగుతూనే ఉంటాయి. దీంతో అధ్వానంగా ఉన్న మార్గానికి మోక్షమెప్పుడు లభిస్తుందా అని గ్రామస్తులు, ఇటువైపు రాకపోకలు సాగించే వాహనదారులు ఎదురుచూస్తున్నారు.

జీవీఎంసీ 58వ వార్డు గాజువాక ఆర్టీసీ డిపో, ఐఎన్ఎస్ ఏకశిల రక్షణ గోడ పక్క నుంచి ఎదురవానిపాలెం గ్రామంలోకి వెళ్లే బీటీ మార్గం అధ్వానంగా మారింది. ఐదేళ్ల క్రితం వేసిన బీటీ రోడ్డు పిక్క తేలి, గోతులమయమైంది. ఈ మార్గం నుంచి ఎదరువానిపాలేనికి, ములగాడ గ్రామానికి, శ్రావణ్ షిప్పింగ్ ప్రాంతాలకు నిత్యం రాకపోకలు సాగించేవారు అధిక సంఖ్యలో ఉన్నారు. పగలు ప్రయాణించేటప్పుడు గోతులు గుర్తించగలిగినా, రాత్రి వేళల్లో మాత్రం వాహనచోదకులు తరచూ ప్రమాదాలపాలవుతున్నారు.

ఎదురవానిపాలేనికి వచ్చే మలుపు మార్గం వద్ద పిక్క తేలి, పెద్ద గొయ్యి ఏర్పడటంతో వాహనదారులు మలుపు తిప్పే సమయంలో జారి గాయాల పాలవుతున్నారు. ఈ సమస్యపై జీవీఎంసీ వర్క్స్ అధికారులకు గ్రామస్తులు, పలువురు వాహనదారులు వివరించినా స్పందించకపోవడంతో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా స్పందించి, రోడ్డు బాగు చేయాలని కోరుతున్నారు.

చాలా ఇబ్బందిగా ఉంది



నేను రోజూ ఈ మార్గం ద్వారానే విధులకు వెళ్తంటాను. ఎదురవానిపాలెం గ్రామానికి వచ్చే మార్గంలో బీటీ రోడ్డు అధ్వానంగా ఉంది. అటు వెళ్లాలంటే చాలా ఇబ్బంది పడుతున్నాం. రాత్రి వేళల్లో ఎందరో వాహనచోదకులు వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలబారిన పడుతున్నారు.

– పెద్దాడ వెంకటరమణ, ములగాడ

రాత్రి సమయంలో ప్రమాదాలు



ఎదురవానిపాలెం గ్రామానికి వెళ్లే బీటీ మార్గంలో చాలాచోట్ల రోడ్డు గోతులమయంగా ఉంది. అలాగే బీటీ మార్గం పిక్క తేలి ఉంది. ద్విచక్ర వాహనాలు మలుపు వద్ద అదుపు తప్పుతున్నాయి. అధికారులు స్పందించి, సమస్య పరిష్కరించాలి.

– అప్పలరెడ్డి, గొందేశివానిపాలెం

దరఖాస్తుల ఆహ్వానం

సబ్బవరం: అనకాపల్లి జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల/కళాశాలల్లో పలు సబ్జెక్టులు బోధించేందుకు ఖాళీగా ఉన్న అధ్యాపక, ఉపాధ్యాయ పోస్టులకు ఆసక్తి కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా సమన్వయకర్త ఎస్. రూపావతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు సంబంధిత ఒరిజినల్, నకలు ధ్రువపత్రాలతో ఈ నెల 12వ తేదీ ఉదయం 10 గంటలకు సబ్బవరంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో నిర్వహించే డెమో తరగతులకు హాజరు కావాలని తెలిపారు. ఇప్పటికే ఆయా ప్రవేశాలకు 14వ తేదీన డెమో తరగతులు నిర్వహించనున్నట్లు ప్రకటన విడుదల చేశామని, అయితే తేదీ మార్పు జరిగి 12నే నిర్వహించనున్నట్లు తెలిపారు. ఖాళీగా ఉన్న ఆయా పోస్టులకు సంబంధిత సబ్జెక్టుల్లో పోస్టు గ్రాడ్యుయేషన్‌లో కనీసం 55 శాతం మార్కులతో పాటు బీఈడీ, టెట్ అర్హత కలిగి ఉండాలన్నారు. అదే విధంగా బాలుర పాఠశాలలకు పురుష అభ్యర్థులను, బాలికల పాఠశాలకు మహిళా అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. బోధనలో అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడుతుందన్నారు. మరిన్ని వివరాలకు ఉమ్మడి జిల్లాల సమన్వయ అధికారి కార్యాలయం ఫోన్ నంబర్ 0891 2799641లో సంప్రదించాలన్నారు. దేవరాపల్లి బాలుర గురుకుల పాఠశాలలో జేఎల్ తెలుగు, కొక్కిరాపల్లి బాలికల గురుకుల పాఠశాలలో జేఎల్ జువాలజీ, కోనాం బాలికల గురుకుల పాఠశాలలో జేఎల్ కెమిస్ట్రీ, నర్సీపట్నం బాలికల గురుకులంలో పీజీటీ సోషల్ సబ్జెక్టుల్లో బోధించడంతో పాటు గొలుగొండ బాలుర గురుకులంలో పీడీ, పీఈటీ ఫ్యాకల్టీ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు.

రోడ్డుపైనే పశువులు

స్థానికుల అవస్థలు



శ్రీరామ్‌నగర్‌లో రోడ్డుపైనే గేదెలను కడుతున్న దృశ్యం

గోపాలపట్నం: పశువులను రోడ్డుపైనే కట్టేయడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. జీవీఎంసీ 92వ వార్డు శ్రీరామ్‌నగర్‌లో, గోపాలపట్నం నుంచి కొత్తపాలెం వెళ్లే రోడ్డులో ఈ పరిస్థితి నెలకొని ఉంది. ఆవులను, గేదెలను రోడ్డుపైనే కట్టడం, పాలు తీసిన తరువాత రోడ్లపైకి వదిలేయడంతో వాహనచోదకులు, పాదచారులు ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు సైతం చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. శ్రీరామ్‌నగర్‌లో పాల వ్యాపారి రోడ్డుపైనే గేదెలను కట్టడం వల్ల ఈ రోడ్డంతా అపరిశుభ్రంగా తయారవుతోందని తెలిపారు. దీని వల్ల దోమలు విపరీతంగా పెరిగిపోతున్నాయని, వ్యాధుల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మహిళా కళాశాలలో ‘వన్ క్యాడెట్ వన్ ప్లాంట్’



కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న ఎన్‌సీసీ క్యాడెట్లు, అధ్యాపకులు

డాబాగార్డెన్స్ : విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా శనివారం ‘వన్ క్యాడెట్ వన్ ప్లాంట్’ కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ఎన్‌సీసీ అధికారి కె. గీతాంజలి నేతృత్వంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. చెట్లను కాపాడడంపై అవగాహన కల్పించే విషయమై ఈ కార్యక్రమం నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. మంజుల తెలిపారు. చెట్లు ప్రకృతి ప్రసాదించిన అమూల్య వరమని, చెట్ల వల్లే ఈ పచ్చని భూమి, మన జీవితం ఆనందంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఆర్. కిరణ్మయి, డాక్టర్ కేఎల్ శిరీష, డాక్టర్ జె. లావణ్య, ఎస్. అనురాధ, అధ్యాపక బృందం, ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

‘హాస్యానందం’ పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సంపాదకుడు రాము

సీతంపేట: హాస్య కథా రచయిత గంగాధర్ వడ్లమన్నాటి సంకలనం చేసిన హాస్యానందం పుస్తకావిష్కరణ సభ శనివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగింది. ముఖ్య అతిథి హాస్యానందం సంపాదకుడు పి.రాము పుస్తకాన్ని ఆవిష్కరించారు. మొదటి ప్రతిని కథా రచయిత ద్విభాష్యం రాజేశ్వరరావుకు అందజేశారు. ఈ సందర్భంగా ద్విభాష్యం మాట్లాడుతూ హాస్యం రాయడం చాలా కష్టమైన ప్రక్రియని అన్నారు. అటువంటికి 38 మంది రచయితలు రచించిన సుమారు 350 కథలతో పుస్తకాన్ని సంకలనం చేసిన గంగాధర్‌ను అభినందించారు. డాక్టర్ డి.వి.సూర్యారావు పుస్తక సమీక్ష చేశారు. మేడా మస్తాన్‌రెడ్డి వ్యాఖ్యాతగా వ్యవహరించారు. కార్యక్రమంలో డాక్టర్ డి.వి.జి.శంకరరావు, ఎం.సుగుణరావు, కొనె నాగవెంకట ఆంజనేయులు, బి.రత్నకుమారి, వాణి శ్రీనివాస్, సునర్ల ఆర్వేశ్వరశాస్త్రి, పాల్గొన్నారు.

బీసీల సంక్షేమానికి ప్రభుత్వాలు కృషి చేయాలి



మాట్లాడుతున్న లగుడు గోవిందరావు

ఎంవీపీకాలనీ: దేశవ్యాప్తంగా బీసీల సంక్షేమానికి కేంద్రంతోపాటు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని అఖిల భారత బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు లగుడు గోవిందరావు కోరారు. ఎంవీపీ కాలనీలోని ఓ హోటల్‌లో సంఘ సభ్యులతో ఆయన శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీసీ సామాజిక వర్గానికి జాతీయ స్థాయిలో తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. దేశంలో అత్యధిక జనాభాగా బీసీలు ఉన్నప్పటికీ వారికి ఉద్యోగ, రాజకీయ, వ్యాపార రంగాల్లో తగిన భాగస్వామ్యం లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో బీసీల అభ్యున్నతికి కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని, బీసీల సంక్షేమానికి కేంద్రం రూ.లక్ష కోట్ల బడ్జెట్‌ను కేటాయించడంతోపాటు ప్రత్యేకంగా బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, బీసీ విద్యార్థులకు ఉపకార వేతనాలను రెట్టింపు చేయాలని, బీసీ కుల వృత్తులకు వంద శాతం సబ్సిడీతో రుణాలు అందించాలని విన్నవించారు. రాష్ట్రంలో త్వరలో భర్తీ చేయబోయే నామినేటెడ్ పోస్టుల్లో బీసీలకు పూర్తిస్థాయి ప్రాధాన్యం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పెదిరెడ్ల సత్యం, వరుదు రాజ్‌కుమార్, పెదిరెడ్ల శ్రీనివాస్‌రావు, బర్ల పైడం నాయుడు, గంగు మన్మధరావు తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన



తులసీదళార్చనలో పాల్గొన్న ఉభయదాతలు



ప్రత్యేక అలంకరణలో కనకమహాలక్ష్మి అమ్మవారు

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శనివారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో నలుగురు ఉభయదాతలు పాల్గొన్నారు. అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. సహస్ర తులసీదళార్చనలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఏఈవోలు వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

6వ రోజుకి శ్రావణలక్ష్మి పూజలు..

శ్రావణమాసాన్ని పురస్కరించుకుని కనకమహాలక్ష్మి దేవస్థానంలో నిర్వహిస్తున్న ప్రత్యేక పూజలు శనివారం 6వ రోజుకి చేరాయి. అమ్మవారికి విశేషపూజ నిర్వహించారు. వేదమంత్రాలు, నాదస్వర సుస్వరాల మధ్య ఉదయం 8.10 గంటలకు శ్రావణలక్ష్మి పూజలు ప్రారంభించారు. 30 మంది భక్తులు విశిష్ట శ్రావణలక్ష్మి పూజలో పాల్గొన్నారు.

కిటకిటలాడిన సింహగిరి



సింహగిరిపై క్యూల్లో బారులు తీరిన భక్తులు

సింహాచలం: సింహగిరి శనివారం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్నారు. భక్తులతో దర్శన క్యూలు, ప్రసాద విక్రయశాల, కేశఖండనశాల, గంగధార ప్రాంగణం కిక్కిరిశాయి. సింహగిరికి వెళ్లే ఆర్టీసీ, దేవస్థానం బస్సులు రద్దీని సంతరించుకున్నాయి. ద్విచక్రవాహనాలు, కార్లతో పార్కింగ్ స్థలాలన్నీ నిండుకున్నాయి. దేవస్థానం కార్యాలయ ఉద్యోగులంతా సింహగిరిపై డిప్యూటేషన్‌పై విధులు నిర్వర్తించారు.

‘కోరమాండల్’ వితరణ

ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లకు 50 స్టాపర్లు అందజేత



ట్రాఫిక్ పోలీసులకు స్టాపర్స్ అందిస్తున్న కోరమాండల్ అధికారులు

మల్కాపురం: మల్కాపురం, గాజువాక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లకు కోరమాండల్ ఇంటర్నేషనల్ సంస్థ 50 స్టాపర్స్‌ను అందించింది. మల్కాపురం స్టేషన్ వద్ద శనివారం జరిగిన కార్యక్రమంలో కోరమాండల్ డీజీఎం (హెచ్ఆర్) ఆర్.శ్రీనివాసరావు వీటిని పోలీసులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశ్రామిక ప్రాంత పరిధిలో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యను దృష్టిలో ఉంచుకుని, పలు ముఖ్య కూడళ్లలో ఏర్పాటు చేసేందుకు స్టాపర్లు అందించామన్నారు. తద్వారా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించివచ్చన్నారు. మల్కాపురం ట్రాఫిక్ ఎస్ఐ అప్పారావు మాట్లాడుతూ కోరమాండల్ వారు ఇచ్చిన ఈ స్టాపర్స్‌ను ముఖ్య కూడళ్లలో, స్కూల్ జోన్ ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో కోరమాండల్ సీనియర్ మేనేజర్ (హెచ్ఆర్) నారాయణపాత్రుడు, సీఎస్ఆర్ డిప్యూటీ మేనేజర్ కె.శ్రీకాంత్, ఎస్.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

తొలగిన మంచినీటి కష్టాలు



మంచినీటి సరఫరా పరిశీలిస్తున్న కార్పొరేటర్ చిన్నా

సింథియా: జీవీఎంసీ 63వ వార్డు పరిధి కాకరల్లోవ, చింతల్లోవ గ్రామాలోని సుమారు 200 కుటుంబాలకు మంచినీటి కష్టాలు తొలగాయి. ఈ గ్రామాల్లో మంచినీటి సరఫరా సరిగ్గా లేక ప్రజలు ఇబ్బంది పడేవారు. స్థానికులు సమస్యను కార్పొరేటర్ గల్లా చిన్నా దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన అధికారులతో మాట్లాడి, ఆ ప్రాంతాల్లో 10 కొత్త పైపు లైన్లు ఏర్పాటు చేయించారు. దీంతో సమస్య పరిష్కారమైంది. కార్పొరేటర్ శనివారం వార్డులో పర్యటించి, నీటి సరఫరాను పరిశీలించారు. కార్యక్రమంలో గూడెల కృష్ణ, జెర్రిపోతుల త్రినాథ్ పుక్కల కృష్ణ, బొండా కృష్ణ, పుక్కల రాజారావు తదితరులు పాల్గొన్నారు.

ఈపీఎఫ్-95 పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న హుస్సేన్

మల్కాపురం: ఈపీఎఫ్-95 పెన్షన్‌దారులకు ప్రభుత్వం రేషన్ కార్డులు, ఆరోగ్య శ్రీ కార్డులను ఇవ్వాలని పెన్షన్‌దారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి హుస్సేన్ డిమాండ్ చేశారు. 61వ వార్డు మల్కాపురం సీఐటీయూ కార్యాలయంలో శనివారం నిర్వహించిన పెన్షనర్స్ సంఘం ప్రతినిధులు, సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈపీఎఫ్ పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి అధికార పార్టీ నాయకులను కలిసి పలుమార్లు వినతులను ఇచ్చినా, వారి నుంచి స్పందన లేకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. పెన్షనర్ల సమస్యలపై ఈపీఎఫ్ కమిషనర్‌ను కలిసేందుకు వెళ్లినప్పుడు అందుబాటులోకి రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురయ్యామన్నారు. వయసు మళ్లిన వారిపై పాలకులు, అధికారులు ఇలా వ్యవహరించడం సరికాదన్నారు. ఇప్పటికైనా స్పందించి సమస్య పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు తమ్మారావు, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యసాధన దిశగా సాగాలి



జ్యోతి వెలిగించి వైద్య శిబిరం ప్రారంభిస్తున్న సీపీ డాక్టర్ శంఖబ్రత బాగ్చీ



విద్యార్థికి వైద్య పరీక్షలు చేస్తున్న సీపీ బాగ్చీ

అల్లిపురం : విద్యార్థులు లక్ష్యసాధన దిశగా ముందుకు వెళ్లాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. సూర్యాబాగ్ పోలీస్ క్వార్టర్స్‌లో గల పబ్లిక్ అండ్ పోలీస్ అసోసియేషన్ ఫర్ స్ట్రీట్ చిల్డ్రన్ (పాపాహోం) కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. సంపూర్ణ ఆరోగ్యంతో లక్ష్య సాధన దిశగా అందరూ ముందుకు వెళ్లాలన్నారు. విద్యార్థి దశ ప్రాముఖ్యతను వివరించారు. పాపాహోం అభివృద్ధికి తోడ్పడుతున్న కమిటీ సభ్యులను, దాతలను సీపీ అభినందించారు. గౌరవ అతిథిగా విచ్చేసిన కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి. శివానంద్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకుని అత్యున్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. ఈ సందర్భంగా సీపీ స్వయంగా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పాపాహోం అధ్యక్షుడు డి.సూర్యప్రకాశరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ అస్లామ్ అరిఫ్, కార్యదర్శి వీఎస్ ప్రకాశరావు, కోశాధికారి రమేష్‌చంద్ జైన్, హెల్త్ క్యాంప్ కో ఆర్డినేటర్ డాక్టర్ కేబీ స్వామి, పాపాహోం సభ్యులు ఎంవీ రాజశేఖర్, ఎంవీవీ సత్యనారాయణ, కృష్ణారావు ఆచారి, భాస్కర శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవుల శాంతియుత ర్యాలీ



నిరసన ర్యాలీలో పాల్గొన్న క్రైస్తవులు

సీతమ్మధార: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మత వివక్షతో కూడిన చట్టాలు, చేస్తున్న దాడులకు వ్యతిరేకంగా క్రైస్తవ ప్రగతి పరిరక్షణ సమాఖ్య (వీఏఐసీ) ఆధ్వర్యంలో శనివారం శాంతియుత ర్యాలీ నిర్వహించారు. క్రైస్తవ మైనారిటీల పట్ల వివక్ష ప్రదర్శిస్తూ 1950 ఉత్తర్వులకు నిరసగా జీవీఎంసీ గాంధీ విగ్రహం పార్కులో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మట్లాడుతూ 1960లో అప్పటి రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్ క్రైస్తవ మైనారిటీలకు మాత్రమే వర్తించేలా మత స్వతంత్ర నిరోధక చట్టాలకు తెరలేపారని గుర్తు చేశారు. ఫలితంగా ఆగస్టు 10న బ్లాక్‌డేగా ప్రకటించి దేశ వ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు చేపట్టామని తెలిపారు.

రెండు తెలుగు రాష్ట్రాల్లోను మతం మారిన క్రైస్తవ మైనారిటీలకు కుల నిర్మూలన చేస్తూ అదర్ క్రిస్టియన్ పేరిట ధ్రువీకరణ పత్రాలు ఇస్తున్నారని పేర్కొన్నారు. రాజ్యాంగం కల్పిస్తున్న ప్రాథమిక హక్కులకు భంగం కలిగిస్తున్న చట్టాల నుంచి విముక్తి కల్పించాలని కోరారు. అంతకు ముందు అధిక సంఖ్యలో క్రైస్తవులు, సమాఖ్య సభ్యులు పలు ప్రాంతాల మీదుగా శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య ప్రతినిధులు ఎం.సుధాకర్‌పాల్, జేమ్స్ కుంపట్ల, కె.ఈశ్వర్ డేనియల్, ఎస్.హనీ జాన్సన్, బిషప్ ఎంఏ పాల్, పలు క్రైస్తవ సంఘాల నాయకులు పాల్గొన్నారు.